సైనికుడిగా
బాహ్యశత్రువును
అంతం చేసిన
అతనికి కనిపించిన
అంతర్ శత్రువు?

# మరో సిద్ధార్థుడు

ప్రఫుల్లచంద్ర
కథ

ఆందోళన ఊపందుకుంది.

బంద్‌లు.. రాస్తారోకోలు... ఊరేగింపులు...

వాళ్లు విద్యార్థులో, రౌడీలోగాని - బస్సులూ, భవనాలూ తగలబెడుతున్నారు. రైలు పట్టాలు పీకుతున్నారు.

నిజానికి వాళ్లు భారతమాత గుండెలమీదనే మంటలు పెడుతున్నారు!

★ ★ ★

బస్సు భయంభయంగా బయలుదేరింది. లోపలి జనం ప్రాణాలు ఉగ్గబట్టుకుని వున్నారు.

బస్సు ఊరు దాటిందో లేదో వాళ్లు భయపడినంతా అయింది. ఎదురుగా రోడ్డుకడ్డంగా ఒక గుంపు.

''ఏయ్, బస్సు ఆపు! ఈరోజు బంద్ అని తెలియదా? ఎందుకు బయలుదేరారు? దిగండి... దిగండి''

చల్లచల్లగా కొందరు దిగారు. డ్రైవర్ ముందే దిగిపోయాడు.

''బాబూ! అమ్మాయి పురిటి నొప్పులు పడుతోంది. పట్నం ఆసుపత్రికి తీసుకెళ్లకపోతే ప్రాణానికే ముప్పు'' బతిమాలుతున్నదో హీనస్వరం.

''ఆసుపత్రిలో చచ్చేకంటే ఇక్కడే చావడం నయంకదా! హహహ... దిగండి... దిగండి''

అందరూ దిగాక వాళ్లు బస్సు తగలబెట్టేశారు.


నడినెత్తిన సూర్యుడు - భగభగ!

ఎదురుగా బస్సు - భుగభుగ!

బయటి ప్రపంచంలో పడాలని గర్భంలో శిశువు తహతహ!

ఆ గర్భవతి నొప్పి తాళలేక - విలవిల!

ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆమె తల్లిదండ్రులు - వలవల!



★ ★ ★

చిన్న పెంకుటిల్లు.

దానిచుట్టూ దడిలాగా వెొట్ట తానుర మొక్కలు.

పూర్తిగా వికసిస్తే ఏం కొంప మునుగుతుందోనని భయపడినట్టు సగం సగం వికసించిన పూలు.

గ్రహణం పట్టినట్లు వెలుగూ, చీకటీ కాని

ఆయోమయ వాతావరణం.

ఆకాశం నిండా గచ్చకాయలు పరిచినట్లు మేఘాలు.

ఇప్పుడో, మరోక్షణానికో వర్షం పడొచ్చు అనిపిస్తోంది కాని పడకపోవచ్చు. గత రెండు రోజులుగా వాతావరణం ఇలాగే వుంది. ఊరించి, ఊరించి వర్షం పడకుండానే మేఘాలు తేలిపోయాయి.

ఆ ఇంటి వెనుక మాతి ప్రక్కనే వున్న కాస్త ఖాళీ స్థలంలోనే పది వంగమొక్కలు నాటింది భారతమ్మ. వాటిలో రెండు మొక్కలే బాగా ఎదిగి పువ్వులతో కళకళలాడుతున్నాయి. మిగిలినవి అణగారిపోతున్నాయి. వాటిల్లో ఒకదాని పరిస్థితి మరీ ఘోరం. అది బాగానే ఎదిగిందిగాని పూతకొచ్చేసరికి దాని కొమ్మ విరిగి మొక్క వాడిపోయింది. పూలు రాలిపోయాయి.

అవిటి కొడుకంటే అమ్మకు ప్రాణం. ఆరోగ్యవంతుడు ఆలనాపాలనా బాగా లేకపోయినా బాగానే ఎదుగుతాడు. కాని అవిటివాడిపట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. అందుకే వెనుకబడిన మొక్కలకు ప్రత్యేక శ్రద్ధతో గొప్పులు తవ్వి గెత్తం వేసింది భారతమ్మ.

ఆ మొక్కలపట్ల ఆమె ప్రత్యేక శ్రద్ధ చూసి - బాగా ఎదిగిన మొక్కల పూలు ముఖాలు ముడుచుకుని గుర్రుగా చూస్తున్నాయి!

★ ★ ★

వంటింటి కిటికీలోంచి ఆ దృశ్యాన్ని చూస్తున్న వివేక్‌కి - మన దేశ పరిస్థితికూడా ఇలాగే వుంది సుమా అనిపించింది. దీర్ఘంగా నిట్టూర్చాడు.

ముందు గదిలో నవీన్ స్నేహితులు చేరారు. బెంచిమీద, కిటికీలో కుర్చీల్లో - ఎక్కడ పడితే అక్కడ - అస్తవ్యస్తంగా కూర్చుని, జరుగుతున్న ఆందోళనగురించి బిగ్గరగా చర్చించుకుంటున్నారు.

''ష్! ఇంటిలో అన్నయ్య ఉన్నాడు'' అన్నాడు నవీన్ - లోగొంతుకతో.

అందరూ గప్‌చిప్...

వివేక్ అంటే వాళ్లందరికీ గౌరవమే. ఏడాదికొకసారి సెలవుపెట్టి ఇంటికొస్తాడు. అందర్నీ ఆత్మీయంగా పలకరిస్తాడు. అన్ని విషయాలూ ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకుంటాడు. అతనికి అందరూ అన్నీ గుర్తే.

ఆ అన్నదమ్ముల అనుబంధం చూడముచ్చటగా వుంటుంది.

ముందు గదిలోని కలకలం విని వంటింటిలోంచి వివేక్ ఆ గదిలోకి వచ్చాడు.

అందరూ నిశ్శబ్దంగా లేచి నిలుచున్నారు. అప్రయత్నంగా అందరి దృష్టీ అతని కుడిచేతివైపు ప్రసరించింది. నిజానికి ఎవరు వివేక్‌ని కలిసినా మొదట చూసేది అతని ముఖాన్ని కాదు! కుడిచేతిని! చూడగానే అయ్యో పాపం అనిపించే ఆ చెయ్యి పూర్తి చెయ్యికాదు, సగం చెయ్యి మాత్రమే!

వివేక్ భారత సైన్యంలో జవాన్.

రెండేళ్ల క్రితం భారత భూభాగంలోకి చొచ్చుకువస్తున్న శత్రువులతో తలపడినప్పుడు అతని కుడిచెయ్యి నుజ్జు నుజ్జు అయింది. ఆపరేషన్ చేసి ఆ చెయ్యి సగం తీసేశారు. అతని ధైర్యసాహసాలకు మెచ్చి భారత ప్రభుత్వం ఐదువేలు బహుమతి ఇచ్చింది.

ఆపరేషన్ అయ్యాక మొదటిసారి ఇంటికొచ్చి ఆ డబ్బు అమ్మ చేతిలో పెట్టి నా చెయ్యి పూర్తిగా తీసేసి మరో ఐదువేలు ఇస్తే తమ్ముడి చదువు నిరాటంకంగా సాగిపోతుంది కదమ్మా'' అన్న వివేక్‌ని హృదయానికి హత్తుకుని బావురుమని ఏడ్చేసింది భారతమ్మ. రిజైన్ చేసి వచ్చేయమని మరీ మరీ వేడుకుంది.

''నేనిప్పుడు యుద్ధానికి పనికిరానమ్మా.

అందువల్ల నన్ను మిలిటరీ ఆఫీసులో గుమాస్తాగా వేశారు. భయం లేదులే'' అని ఊరడించాడు.

''చదువులేకపోతే పీడాపోయె. ఈ డబ్బు మాకొద్దు. కూలీనాలీ చేసి అయినా అమ్మని పోషించుకుంటాం'' అన్నాడు ఇంటర్ చదువుతున్న తమ్ముడు నవీన్.

అమ్మ రక్షణకు తమ్ముడు.

-భారతమాత రక్షణకు తను!

వివేక్ ఛాతీ సగర్వంగా ఉప్పొంగిపోయింది.

కానీ ఇప్పుడు -

నవీన్ బి.కాం మొదటి సంవత్సరం విద్యార్థి. రంగుతేలాడు. వేషం, భాష మారాయి. ముఖానికి స్నో. షర్ట్‌కి సెంట్ తప్పని సరి అయ్యాయి.

పైగా ఉద్యమ నాయకుల్లో ఒకడు.

వంటింటిలోంచి ముందు గదిలోకి వస్తూనే అందర్నీ పలకరించాడు వివేక్. అందరూ కూర్చున్న తరువాత ఉద్యమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

''మెరిట్ చచ్చిపోతోంది చచ్చిపోతోంది అంటున్నారుకదా. మెరిట్ అంటే ఏమిటి?'' అడిగాడు.

ఓస్, అదే తెలియదా అన్నట్లు అందరూ దరహాసం చేశారుగానీ ఎవరూ సమాధానం చెప్పలేదు.

''మీ ఉద్దేశంలో మెరిట్ అంటే పరీక్షల్లో సంపాదించిన మార్కులు! అంతేకదా?'' అడిగాడు వివేక్.

''అవును అంతేకదా!'' అన్నాడు సచ్చిదానందం.

''నువ్వు... ముఖ్యంగా మెరిట్ చచ్చిపోతోందని ఆక్రోశించడం వింతగా వుంది సచ్చిదానందం! నువ్వు పరీక్షలు ఎలా పాస్ అవుతున్నావో ఎవరికి తెలియదు?''

అందరూ ఘొల్లున నవ్వేశారు. సచ్చిదానందం ముఖం జేవురించింది.

''సరే, మీ అందరూ ప్రతిభావంతులే. ఒప్పుకుందాం. కానీ మీ ప్రతిభవల్ల సమాజానికి పిసరంత లాభం వుందా?'' సూటిగా అడిగాడు వివేక్.

అక్కడున్న అందరికీ వివేక్ పట్ల గౌరవమే. కాని ఇప్పుడు మాత్రం అతడు ప్రశ్నిస్తున్న తీరు చూశాక ఆ గౌరవభావం సడలిపోతోంది. తమ ఆందోళన

## చిట్కా

''నేను రోజుకి పది పాకెట్లుకూడా అమ్మలేను, మరి నువ్వు రోజుకి వంద పాకెట్లు ఎలా అమ్మగలవు?'' అడిగాడు వంశీ.

''తలుపు తెరిచిన ఆడవారిని చూసి మీ అమ్మగారున్నారా అని అడుగుతుంటా'' చెప్పాడు సురేష్.

- పి.వి.మురళీకృష్ణ (హైదరాబాద్)



గురించి ఎవరూ ఇంతవరకూ ప్రశ్నించనేలేదు.

''అదేం తిక్క ప్రశ్న? ప్రతిభావంతులు లేని సమాజం నాశనం అయిపోదూ?'' చిరాకుగా అడిగాడు గోపాల్.

అతని చిరాకు చూసి వివేక్ నొచ్చుకోలేదు. స్థిమితంగానే అన్నాడు.

''పదేళ్ల క్రితం ప్రక్క వీధిలో ఒక ప్రతిభావంతుడు వుండేవాడు. మన గ్రామ చరిత్రలో మెడికల్ సీటు సంపాదించిన ఒకే ఒక్క మేధావి అతడు. నాకింకా జ్ఞాపకం వుంది. అతడు డాక్టరయ్యాక మన గ్రామంలోనే ప్రాక్టీస్ పెడతాడనుకుని గ్రామస్థులందరూ అతనికి ఘనంగా సన్మానం చేశారు. కానీ, అతగాడు పట్నంలో ప్రాక్టీసు పెట్టాడు. ఇప్పుడతడ్ని కలవాలంటే ఫీజు 50 రూపాయలు. అతనివల్ల ధనికులకు ప్రయోజనం కలిగిందేమోగానీ సామాన్య ప్రజలకేం ఒరిగింది? సమాజానికేం లాభించింది?''

వివేక్‌వైపు అసహనంగా చూశారంతా. అతడు నవీన్ అన్న. నవీన్ తను ఉద్యమ నాయకుడు. అందువల్ల సంకోచిస్తున్నారుగాని లేకపోతే వివేక్ పని పట్టేవారే.

''ఐదేళ్ల క్రితం లోన్‌లూ, పెన్షన్‌లూ శాంక్షన్ చేసే శాఖలో ఒక అధికారి వుండేవారు. స్వంత ప్రతిభతోనే ఉద్యోగం సంపాదించుకున్నారాయన. మా నాన్న రిటైర్ అయ్యాక గ్రాట్యుటీ మొదలైనవి యాభైవేలవరకూ రావలసి వుండేది. వస్తుంది కదా అన్న నమ్మకంతోనే మా అక్కకు సంబంధం కుదిర్చి ఆ డబ్బుకోసం ఆ అధికారి చుట్టూ ఎన్నిసార్లు తిరిగారు మా నాన్న. కుంటిసాకులు చెబుతూ ఆయన డబ్బు శాంక్షన్ చేయలేదు. పీటలమీద పెళ్ళి ఆగిపోగా అక్క ఆత్మహత్య చేసుకుంది. ఆ బెంగతోనే మా నాన్న చనిపోయారు. నా చదువు ఆగిపోయింది. లంచం ఇచ్చి ఉద్యోగం కొనుక్కోలేని నేను సైన్యంలో చేరాను''

ఆ జ్ఞాపకాలతో కన్నీరు మున్నీరు అయాడు వివేక్. ఆ రోజులు నవీన్‌కీ జ్ఞాపకమే. ఆఫీసర్లందర్నీ కట్టకట్టి షూట్ చేసెయ్యాలన్నంత కసిగా వుండేది అతనికా రోజుల్లో.

''ఇప్పుడు చెప్పండి, ఇటువంటి ప్రతిభావంతులవల్ల సమాజానికి జరిగే మేలు ఏమిటి? స్వయం ప్రతిభతో మీరు ఉద్యోగం సంపాదించినా ఆ అధికారిలానే ప్రవర్తించరన్న గ్యారంటీ వుందా? వేలు కుమ్మరిస్తేగాని ఉద్యోగాలు దొరకని ఈ రోజుల్లో ప్రతిభకు నిజంగా పరిగణన వుందా?''

వివేక్ ఈ ఆందోళనను వ్యతిరేకిస్తున్నట్లు అర్థం అయిపోయింది అందరికీ. కోపం వచ్చేసింది. వివేక్‌ని ఏమీ అనలేక నవీన్‌వైపు కొరకొరా చూశారు. నవీన్‌కి కూడా అన్నయ్య ధోరణి నచ్చలేదు. కానీ ఏమీ అనలేక తలవంచుకున్నాడు.

''ఉద్యోగాలన్నీ వాళ్లకే కట్టబెట్టండి! దేశం బాగుపడిపోతుంది!'' అక్కసుగా అన్నాడు గోపాల్.

వాళ్లు! వీళ్లు!!

దేశానికి స్వతంత్రం వచ్చిందిగాని సంఘీభావం రాలేదు.

వాళ్లు, వీళ్లు అన్న వేర్పాటుభావం తప్ప, అంతా కలిసి ఒకటే అన్న సమైక్య భావన అసలే లేదు.

''వాళ్లేదో ఉద్ధరిస్తారనీ, మీరు ఉద్ధరించరనీ కాదు నా ఉద్దేశం. హక్కుల పరిరక్షణకోసం ఆందోళనలు అవసరమే. కాదనను. అయితే మీ విధానాలకే నా వ్యతిరేకత. దేశం ఆ చివరినుండి ఇక్కడికొస్తూ ఆందోళన విశ్వరూపాన్ని తిలకించాను. గోడలమీద, బస్సులమీద రాసిన బూతుల సంగతి అటుంచి, మెరిట్ అన్న చిన్నమాట తప్పులేకుండా ఇంగ్లీషులో రాయలేకపోతున్నారు! మెరిట్ అని అంగలార్చే మీరు

పరీక్షల్లో కాపీలెందుకు కొడుతున్నారు? కాపీలెందుకు ప్రోత్సహిస్తున్నారు? పేపర్ లీక్ అయిందని తెలిస్తే చాలు వందలు పోసి జెరాక్స్ కాపీలకు ఎందుకు ఎగబడుతున్నారు? లంచంపోసి ఉద్యోగాలెందుకు కొనుక్కుంటున్నారు?''

బయట చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇదిగో అదిగో అనుకుంటున్న వర్షం నిజంగా కురిసేటట్టే వుంది.

రేపటి కార్యక్రమం నిర్ణయించుకోవాలని వచ్చిన నవీన్ స్నేహితులకు సూదలమీద కూచున్నట్టు వుంది. నిజానికి ఉద్యమం ప్రారంభించేముందు ఇవన్నీ ఆలోచించలేదు వీళ్లు. ఎక్కడో ఉద్యమం ప్రారంభం అయిందనగానే తామూ ప్రారంభించేశారు.

వివేక్ అడుగుతున్న ఒక్కో ప్రశ్నా శరాఘాతంలా వుంది.

విద్యార్థుల్ని ప్రశ్నించడానికి ఎన్ని గుండెలు?!

స్నేహితుని అన్న కదాని ఇంతవరకూ సహించారు వాళ్లు.

''ఇంతకూ మీరనేది ఏమిటి?'' చిరాకుగా అడిగాడు గోపాల్.

''మీ ఉద్యోగాలకోసం, మీ బాగుకోసం, మీ స్వార్థంకోసం మీరు చేస్తున్న ఆందోళన ఇది! అందుకు ఏ సంబంధమూలేని ప్రజల్ని మూల్యం చెల్లించమనడం అన్యాయం! ఎంతకాలం ఇలా రైళ్లని ఆపుతారు? ఎంతకాలం ఎన్ని బస్సుల్నిలా తగలబెడతారు? ఎంతకాలం ఈ బంద్‌లు? రిలే నిరాహారదీక్షలుకాదు, ఆమరణ నిరాహారదీక్ష చేసే తెగువ, నైతిక బలం మీలో ఒక్కరికీ లేదా?''

గట్టిగా సమాధానం చెప్పి అతని నోరు మూయించాలని అందరికీ కోరిక అయితే వుందిగానీ ఎవరూ మాట్లాడలేదు. అందరి తలలూ వాలిపోయాయి.

''పోనీ మీకోసం నేను ఉద్యోగం ఒదులుకుని ఆమరణ నిరాహారదీక్ష వహిస్తాను. ఈ బంద్‌లు, రాస్తారోకోలు, దహనాలు ఆపేసి నాతో సహకరిస్తారా?''

చటుక్కున తలలు ఎత్తి అందరూ అతనివైపు చూశారు.

వాళ్లేదో అనేలోగా -

ఒక్కసారిగా చలిగాలి లోనికి దూసుకొచ్చి కిటికీలు టపటపా కొట్టుకున్నాయి. గోడకు

## అతిపెద్ద పుష్పం



ప్రపంచంలోకెల్లా మిక్కిలి పెద్ద పుష్పం రఫ్లేసియా ఆర్నోల్డి. ఇది సుమత్రా ద్వీపములోని అడవులలో లభిస్తుంది. దీని వ్యాసం సుమారు *1* మీటరు వుంటుంది. దీని మందం *2* సెంటీమీటర్లుంటుంది. ఒక్క పువ్వు బరువే *11* కిలోలుంటుంది. ఇది *5*నుండి *7* రోజులవరకు వికసించి వుంటుంది. దీనిరంగు ఎరుపు లేక బూడిదరంగు కలిసిన నారింజ రంగులో వుంటుంది. దీని వాసన మనకు బాగుండదుకానీ ఈ ఘాటయిన వాసనకు ఈగలు ఆకర్షితమవుతాయి. ఈగలవలన పరాగ సంపర్కం జరుగుతుంది. ఇది పరాశ్రయ జీవి మొక్క కావడంతో ఇతర మొక్కలనుండి ఆహారాన్ని గ్రహిస్తుంది. నీటికి ఆకులుండవు.

- శ్రీకొండ

తగిలించిన కాలెండర్లు విలవిలలాడాయి. ఆ గాలితోపాటు ఎం.పీగారి తమ్ముడు సింగినాదం లోనికి చొచ్చుకువచ్చాడు. వస్తూనే -

''అబ్బాయిలూ! రేపు బంద్ అదిరిపోవాల! మనోళ్లని మీతో పంపిత్తాలెండి. భయపడకండి! విజృంభించండి! రిలే నిరారం కోసం సామ్యానా, దండలు, ఫోటోగ్రాఫులూ ఏర్పాటుచేశా. దీచ్చ అయాక రేత్తిరి మానస ఒటేల్లో గ్రాండ్ డిన్నర్! పలావ్! కోడి! ఏట మాంసం! ఏదంటే అది. మరి జూసుకోండి. దీచ్చకి ఎవరెవరు ఒత్తారో! ఎందరు వత్తారో! డబ్బుకోసం ఎనకా ముందూ అనకండి! నేనున్నా!''

ఆ స్వరంలో సంతృప్తి, గర్వం, అధికారం ధ్వనిస్తున్నాయి.

ఉద్యమం ఊపందుకున్నందుకా సంతృప్తి.

చదువు సంధ్యల్లేని తన చెప్పు చేతల్లో విద్యార్థులంతా గొర్రెపిల్లలయినందుకా గర్వం!

ఈ దెబ్బతో పాలకపక్షం గిరికీలు కొట్టి అధికారం తమ పార్టీకీ అందులో కొంతభాగం తనకూ అని ఆ ధీమా!

''సింగినాథం ఆత్మాహుతికోసం ఎవరినైనా కుదిర్చావా లేదా ఇంకా?''

అప్పుడు చూశాడు సింగినాదం వివేక్‌ని.

''ఒడ్డడ్డ! నువ్వటయ్యా ఇవేక్! ఎప్పుడొచ్చినావ్? బాగున్నావా?''

''ఇంతకూ కుదిర్చావా లేదా? లేకపోతే ఎవరో అర్భకుడిని చూసి నువ్వే మంటల్లోకి తోసెయ్! ఆత్మాహుతి అని ప్రచారం చేసుకోవచ్చు!''

వేళాకోళంగా కాక వివేక్ సీరియస్‌గా అంటున్నాడని గ్రహించిన సింగినాదం ముఖం మండుతున్న రాక్షసి బొగ్గులాగా కణకణలాడింది.

''మా సమస్యలు తీర్చుతానని చెప్పి వాగ్దానం చేసి ఓట్లు గుంజుకుని ఎంపీ అయిన మీ అన్న ఢిల్లీలో కూర్చున్నాడు. ఆందోళనతో ప్రజలిక్కడ అట్టుడికి పోతోంటే...''

వివేక్ మాట పూర్తికానే లేదు. సింగినాదం ఒక్కసారిగా రెచ్చిపోయాడు.

''ఒక్క ఎంపీ ఏం సెయ్యగలడు? మెల్లగా సెబితే పెబుత్వం మన మాట ఇంటాదా? బంద్‌లు, రాస్తారోకోలు జేత్తేగాని తిక్క కుదరదు. బస్సులు, బిల్డింగులూ తగలెడితేగాని పెబుత్వం బుర్రలో బల్బు ఎలగదు! ఇదిగో ఇవేక్ ఇప్పుడే జెబుతున్నా. నీకిట్టం లేకపోతే మానెయ్‌గానీ ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చకు! ఇదిగో అబ్బాయిలూ, ఇప్పుడు నాతో ఒత్తున్నారా లేదా?'' అంటూ రుసరుసలాడుతూ సుడిగాలిలాగా బయటకు దూసుకుపోయాడు.

విద్యార్థులొకరొకరూ మెల్లగా జారుకున్నారు.

చివరకు మిగిలిన నవీన్ కూడా ''అన్నయ్యా! నువ్వింకా సత్యకాలం మనిషివి! నీకేం తెలియదు! నువ్వూరుకో!'' అంటూ తల వంచుకొని బయటకు వెళ్లిపోయాడు.

వివేక్ ఒక్కడే నిస్తేజంగా ఆ గదిలో మిగిలిపోయాడు. కాసేపటికే ఆకాశం భళ్లున బద్దలైంది. కుండపోతగా వర్షం.

చూస్తుండగానే మురికి కాలువలు నిండిపోయి రోడ్లని ముంచేశాయి. ఇల్లు కారిపోతోంది.

కారుతున్న ప్రతిచోటా గిన్నెలు, చెంబులు వుంచి వంటింటి కిటికీలోంచి నూతివైపు చూసింది భారతమ్మ. మొక్కలు మునిగిపోతున్నాయి. వెనుకబడిన మొక్కలతోబాటు కనుల పండుగగా ఎదిగిన మొక్కలుకూడా నాశనం అయిపోతాయేమోనని తల్లడిల్లిపోయింది భారతమ్మ.

ఇప్పుడు తన ప్రక్కనే వివేక్ వుంటే -

అవును, వివేక్ ఎక్కడ?

ఇంత బీభత్సం జరుగుతున్నా, వివేక్ గదిలోంచి

బయటకురాలేదన్న విషయం హఠాత్తుగా గుర్తించి.

వివేక్ ఉన్న తలుపు తట్టింది. పిలిచింది. అరిచింది. కాని తలుపులు తెరుచుకోలేదు.

హఠాత్తుగా కరెంటు పోయి గాఢాంధకారం అలుముకుంది.

తలుపులు మూసుకుని వివేక్ ఏం చేస్తున్నట్టు?

మిలిటరీలో ఒంటి చేతితో అష్టకష్టాలు పడుతూ కుటుంబ పోషణకోసం, తమ్ముడి చదువుకోసమూ డబ్బు పంపిస్తున్నందుకైనా అన్న మాట విని వుండాల్సింది నవీన్.

తన మాటలంటే గౌరవం లేకుండా నవీన్ ఆందోళనకారులతో వెళ్ళిపోయినందుకు వివేక్‌కి కోపం వచ్చిందో ఏమో!

ఆ కోపంలో ఏ అఘాయిత్యం తలపెడతాడో!

నిస్సహాయంగా రోదిస్తూ గుమ్మం వద్ద కూలబడిపోయింది భారతమ్మ.

వర్షం తగ్గి కరెంట్ వచ్చాక ఇల్లు చేరిన నవీన్‌కి విషయం చెప్పింది అమ్మ.

గాబరాగా తలుపు తట్టుతూ "అన్నయ్యా! అన్నయ్యా!!" అని అరిచాడు నవీన్.

వెంటనే తలుపులు తెరుచుకున్నాయి..

ఒక్క ఉదుటున భారతమ్మ గదిలోకి వెళ్ళింది. చుట్టూ చూసింది. వివేక్ ఏ అఘాయిత్యానికీ పాల్పడలేదు. క్షేమంగానే వున్నాడు. అమ్మయ్యా అని దీర్ఘంగా నిట్టూర్చింది భారతమ్మ.


కానీ వివేక్ ముఖంలో ఏదో విషాదం, ఏదో బాధ..

"బాబూ, ఏమయిందిరా నీకు? నువ్వు వచ్చినప్పటినుంచి చూస్తున్నా. అదోలా వుంటున్నావ్! నీ బాధ ఏమిటో చెప్పరా!" ప్రాధేయపడుతున్నట్లు అడిగింది అమ్మ. వివేక్ సమాధానం చెప్పకపోవడంతో ఆమె విలవిలలాడిపోయింది.

అన్నయ్యకు కోపం వచ్చిందని గ్రహించిన నవీన్ తల వంచుకున్నాడు.

"నేనీ ఉద్యోగం మానేస్తానమ్మా!"

ఒక్కసారిగా ఆనందం ముంచుకొచ్చింది భారతమ్మలో కాని ఆ ఆనందం నిలబడలేదు. వివేక్ స్వరం మామూలుగా లేదు. ఏదో నిర్ణయం, దృఢనిశ్చయం ఆమెను భయపెట్టింది. కొడుకునైపు తేరిపార చూస్తూ, మాటలు పేర్చుకుంటూ అంది.



''ఆ ఉద్యోగం మానెయ్యమని ఎప్పుడో చెప్పాను. ఆ కొండ కోనల్లో అంత దూరంలో ఒంటరిగా అష్టకష్టాలు పడుతూ ఎందుకు నాయనా ఆ ఉద్యోగం? మానెయ్! ఇక్కడే ఏదో పని చేసుకుంటూ మా కళ్లఎదుట వుంటే అంతే చాలు''

''కష్టపడలేక నేనీ నిర్ణయానికి రాలేదమ్మా! సరిహద్దు డొంకల్లో దొర్లుతూ పొదలలో పడుకుంటూ వుండే రోజుల్లో నాకేమీ బాధ అనిపించలేదు. నేను కష్టపడినా నావాళ్లు సుఖంగా వున్నారన్న సంతృప్తి వుండేది. రక్షణ కవచంలో నేనొక లింకుగా వుంటూ రక్షిస్తుంటే శత్రుభయం లేకుండా నా దేశం దృఢంగా కృతనిశ్చయంతో ముందడుగు వేస్తోందన్న ఆత్మానందంతో కలలు కంటూ వుండేవాడిని. జన్మ ధన్యమైందని పొంగిపోయేవాడిని''

ఆరోజులు నెమరేసుకుంటున్నట్టు కాసేపు అలాగే వుండిపోయాడు.

భారతమ్మ, నవీన్ తలలు వంచుకుని నిరీక్షిస్తున్నారు.

''కానీ ఇప్పుడు నేను చూస్తున్నదేమిటి? ఆందోళన పేరుతో ఆయిల్‌టాంకర్స్‌ను తగులబెట్టి ఆనందంతో కేరింతలు కొడుతున్న మూర్ఖుల్ని! బంద్ పాటించకుండా చదువుకుంటున్నారన్న దుగ్ధతో ప్రక్క స్కూలుకు వెళ్లి ఒక అర్భకురాలి ఒంటిమీద కిరసనాయిల్‌పోసి తగలబెట్టే శాడిస్టులను! ప్రజల్ని దింపేసి రైళ్లు తగలబెట్టే ప్రబుద్ధులు కొందరైతే జనంతోనే రైళ్లను తగలబెట్టే రాక్షసులు కొందరు...''

ఏదో చెప్పాలని తల ఎత్తాడు నవీన్.

వివేక్ చటుక్కున అతని వైపు తిరిగి ''ఆ పనులు చేస్తున్నది విద్యార్థులు కాదు, సంఘ విద్రోహ శక్తులు అంటావ్!''

నవీన్ తల మళ్లీ వాలిపోయింది.

''ఆ పనులు చేస్తున్నదెవరో మీకు తెలుసు. అయినా వాళ్లని అరెస్టు చేయించే దమ్ము మీకు లేదు. పైగా వాళ్లతోనే తిరుగుతారు. ఆందోళన మీ చేతిలో లేదు. వాళ్ల చేతిలో వుంది. సర్వనాశనం చేస్తేగాని ప్రభుత్వానికి బుద్ధిరాదని మీ విశ్వాసం! ప్రభుత్వం అంటే ప్రజలు! ప్రజలంటే మనమేనన్న స్పృహ లేనివాడికి చదువెందుకురా? చెప్పు! చెప్పరా చెప్పు!'' అంటూ ఒంటి చేతితో నవీన్ భుజం పట్టి కుదిపివేశాడు వివేక్.

శరీరం అప్పగించేసి ఉండిపోయాడు నవీన్.

''చెప్పరా, చెప్పు!''

ఏదో ఒకటి చెప్పక తప్పలేదు నవీన్‌కి. ''రాజకీయ నాయకులు స్వార్థంతో... రిజర్వేషన్లు'' అని గొణిగాడు.

''నిజమే. తన కుర్చీకోసం... తన ఐదేళ్ల జీవితంకోసం దేశాన్ని భ్రష్టు పట్టించి కులాల చిచ్చు రేపేది ఒకరైతే, రాముడి పేరుచెప్పి, దేవుడి పేరుచెప్పి మతాల మధ్య మనసుల మధ్య మంటలు పెట్టేది ఒకరు. ఆ స్వార్థపరుల ఆట కట్టించి కళ్లు తెరిపించవలసిందే. కాని మీరు చేస్తున్నదేమిటి?'' గద్దించాడు వివేక్.

ఇలాంటి సందర్భాలలో సమాధానం చెప్పకపోవడమే మంచిదనుకున్నాడు నవీన్. వివేక్ అందుకున్నాడు.

''మీరు చేస్తున్నదేమిటి? ఒకరి స్వార్థాన్ని ఎదిరించడానికి మరో స్వార్థపరుడి చేతిలో కీలుబొమ్మల్లా ఆడుతున్నారు! సింగినాథం నిన్నటివరకూ వీధి రౌడీ. ఇప్పుడు నిస్వార్థ ప్రజాసేవకుడు! ఇవాళ వాడు చెప్పినట్టల్లా ఆడి రేప్రొ వాడిని ఎన్నికల్లో గెలిపించి, ఎల్లుండి మళ్లీ వాడి స్వార్థాన్ని ఎదిరించడానికి రోడ్డున పడి చదువుకు ఎగనామం పెట్టి మీలో మీరే తన్నుకు చస్తారు. వాడు బాగానే వుంటాడు. ఇంత చిన్న విషయాన్ని

గ్రహించలేని మీ చదువులూ, డిగ్రీలూ ఎందుకు, తగలెయ్యనా? ఎస్‌బాస్ అంటూ తిరిగే కిరాయి గూండాలకూ మీకూ తేడా ఏమిటి? ఇలాంటి మూర్ఖుల్ని రక్షించడానికే నేను సైన్యం చేరి ప్రాణత్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డాను? విద్య అనేది వివేకం ఇవ్వాలి! వివేచన ఇవ్వాలి! చైతన్యం కలగజేయాలి! కాని... కాని...''

ఆవేశంతో, ఆవేదనతో వివేక్ హృదయం స్టెన్‌గన్ అయింది!

ఆ గన్‌లోంచి మాటలు తూటాల్లాగా దూసుకొస్తున్నాయి. వెలుగులు విరజిమ్ముతూ. హృదయాన్ని గజగజ లాడించే ఆ వెలుగునీ, ఆ శబ్దాన్నీ భరించలేక నవీన్ కళ్లు మూసుకున్నాడు.

నిప్పులు కక్కి, నిప్పులు కక్కి చివరకు స్టెన్‌గన్ మూగబోయింది.

కాని వివేక్ మాత్రం కదలక మెదలక అలాగే నిలబడిపోయాడు. గన్ మూగపోయినా, చుట్టూ వ్యాపించే వేడిమిలాగా సుడులుతిరుగుతున్నాయి అతని ఆలోచనలు.

ఎక్కడుంది లోపం?

మార్కులే పరమార్థం! మార్కులే మెరిట్!! అనుకుంటూ మార్కులకే ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని పట్టించుకోని నేటి విద్యావిధానంలోనా?

టైం టేబుల్ ప్రకారం యాంత్రికంగా, కంప్యూటర్‌లాగా పాఠం చెప్పేసి బాధ్యత దులుపుకుని పోయే ఉపాధ్యాయులలోనా?

పిల్లల పట్ల శ్రద్ధ వహించని తల్లిదండ్రులలోనా?

ఎక్కడుంది లోపం?

స్టెన్‌గన్ చల్లారిపోయింది.

వివేక్‌లోని ఆలోచనలు ఒక రూపు దిద్దుకుని మార్గాన్ని నిర్దేశిస్తూ స్థిరపడ్డాయి. అతని ముఖంలో గాంభీర్యం సడలిపోయింది.

భయంతో కుంచించుకుపోయిన నవీన్‌నుంచి అమ్మవైపు దృష్టి మరల్చాడు. అమ్మకూడా ఒక మూల కుంచించుకుపోయి భయంభయంగా చూస్తోంది.

వివేక్‌కి నవ్వొచ్చింది. గదిలో ఒక మూల తన బట్టలూ, వస్తువులతో సర్దిపెట్టుకున్న కిట్ బ్యాగ్ వుంది. దాన్ని భుజానికి తగిలించుకుని అమ్మకు మోకరిల్లి ''వస్తానమ్మా'' అంటూ రెండడుగులు వేశాడు.

''బాబూ! ఎక్కడికిరా?'' ఆందోళనగా అడిగింది అమ్మ.

ఆగి నిశ్చలంగా అమ్మవైపు చూసి అన్నాడు వివేక్ -

''అమ్మా! శత్రువు బయటనుంచి వస్తాడనీ, సరిహద్దుల్ని జాగ్రత్తగా కాపలాకాస్తే చాలనీ అనుకునేవాడిని! కానీ దేశంలోనే ఉన్న శత్రువులతో ముప్పు ముంచుకొస్తోందమ్మా! ఈ శత్రువుల్ని ఎదుర్కోడానికి సైనికులు కాదమ్మా, ఉత్తమ ఉపాధ్యాయులు కావాలి! మార్కుల మాయాజాలంనుంచి తప్పించి, సామాజిక స్పృహ, ప్రజాస్వామ్యస్ఫూర్తి నేర్పి విద్యార్థుల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దే ఉత్తమ ఉపాధ్యాయులు! అలాటి ఉపాధ్యాయులకోసం అన్వేషించి ఒక ఆదర్శ పాఠశాలను ప్రారంభించే దిశలో సాగిపోతాను. నా మార్గం సుదీర్ఘం. కంటకావృతం. తక్షణ ఫలితం వుండదని తెలుసు. అయినా ఎప్పుడో, ఎక్కడో ఒక ప్రారంభం అంటూ జరగాలి కదా! నన్ను ఆశీర్వదించమ్మా'' అంటూ ముందడుగు వేశాడు వివేక్.

ఆ క్షణంలోనే -

ఆకాశం అంతటా విద్యుల్లత అల్లుకుని ధగద్ధగాయమానంగా మెరుస్తూ ఆశీర్వదించగా -

దిక్కులు పిక్కటిల్లేటట్లు ఉరుముల మేళతాళాలు అతనికి స్వాగతం పలికాయి.

★ ★ ★